క్లుప్తంగా

హైస్కూల్ పునఃప్రారంభించాలని నిరసన



హైస్కూల్ ప్రారంభించాలని నిరసన దీక్ష చేస్తున్న పూర్వ విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలోని ద్రాక్షారామలో ఉండే ఎస్‌పీవీఆర్ హైస్కూల్‌ను పునః ప్రారంభించాలని ఆదివారం పూర్వ విద్యార్థులు నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఎస్‌పీవీఆర్ హైస్కూల్ మూసి ఉందని వెంటనే ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ద్రాక్షారామలోని ఎస్‌పీవీఆర్ స్కూల్ పరిధిలో ఉండే విద్యార్థులు ఇక్కడ స్కూల్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని విద్యాశాఖ అధికారులు తక్షణం స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలోని ధనమ్మ మర్రిలో వెలసిన శ్రీధనమ్మతల్లికి ఆడపడుచులు ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంతోపాటు ఆలమూరు, కొత్తపేట, కె.గంగవరం, పి.గన్నవరం తదితర మండలాల ప్రజలు ధనమ్మ మర్రికి తరలివచ్చారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



అంగరలో మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామానికి చెందిన గుత్తుల శ్రీనివాస్ ఇటీవల టేకి శివారులో సైకిల్‌పై వెళ్తూ మూర్ఛ కారణంగా మృతి చెందాడు. అతని కుటుంబానికి మండల శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి వాసు, వనుం పార్థసారథి ఆధ్వర్యంలో రూ.5 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. శెట్టి బలిజ సంఘం నాయకులు కొప్పిశెట్టి వాసు, మేడిశెట్టి దుర్గారావు, పితాని సూర్య చంద్రరావు, శీలం రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: యానం, ద్వారపూడి రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరానికి చెందిన కనకాల రామారావు తన బైక్‌పై యానం వెళుతున్నారు. మండలంలోని కోలంక వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డుపక్కన ఉన్న పంటకాలువలోకి బైక్‌తో సహా పల్టీలు కొట్టాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం యానం ఆసుపత్రికి తరలించారు.

నేడు మండపేటలో గడప గడపకూ..

మండపేట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం పట్టణంలోని 11వ వార్డులో పర్యటించనున్నట్టు వైఎస్సార్ సీపీ కార్యాలయ కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు న్యూకాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కృష్ణ, స్వామి

మండపేట: విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం పటిష్టతకు కృషి చేస్తామని సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కోటిపల్లి కృష్ణ, కార్యదర్శి దార్ల స్వామి పేర్కొన్నారు. ఆదివారం రావులపాలెంలో జరిగిన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారంలో మండపేట కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షుడు కృష్ణ జిల్లా సంఘం ఉపాధ్యక్షుడిగా, స్వామి కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేశారు. పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వారికి అభినందనలు తెలిపారు.

మాధ్యమిక విద్యకు మంచిరోజులు

- రాయవరంలో పొలాల నుంచి గ్రామంలోకి జూనియర్ కాలేజీ తరలింపు
- ఉత్తర్వులు వెలువరించిన ఇంటర్ బోర్డు అధికారులు
- మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్సీ తోట
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



గ్రామానికి దూరంగా ఉన్న రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల

రాయవరం: ఇప్పటివరకూ పంట పొలాల మధ్య ఉన్న రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కొరతను ఎదుర్కొంటోంది. ఊరికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడం.. రవాణా సౌకర్యం లేక పోవడం..పంట పొలాల మధ్య ఉండడం..విషసర్పాల భయంతో ఈ కళాశాలలో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపేవారు కాదు. ఏటా విద్యార్థులను చేర్పించేందుకు అధ్యాపకులు ఇంటిబాట పట్టేవారు. అరకొర విద్యార్థులతో కళాశాల ఉనికికే ప్రమాదం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో జూనియర్ కళాశాలను గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలోకి మార్చాలనే డిమాండ్ గత కొన్నేళ్లుగా వస్తోంది. ఎట్టకేలకు జూనియర్ కళాశాలను రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోకి మారుస్తూ ఇంటర్‌బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాయవరంలో మాధ్యమిక విద్యకు మంచి రోజులు వచ్చినట్టు అయింది.

అప్పట్లో పేదలకు వరం

రాయవరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను 1984లో ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల పేద విద్యార్థులకు వరంగా మారింది. సుమారు 600 మంది వరకూ విద్యాభ్యాసం చేసేవారు. తొలుత ఈ కళాశాలను శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో షిఫ్టుల పద్ధతిలో నిర్వహించేవారు. 2001లో గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో పంట పొలాల మధ్య భవన నిర్మాణం చేసి అక్కడకు తరలించారు. అప్పటి నుంచి కళాశాలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. గ్రామానికి దూరంగా ఉండడంతో విద్యార్థుల చేరికలు క్రమంగా తగ్గిపోతూ కళాశాల ఉనికికే ప్రమాదంగా ఏర్పడింది. ఒక సమయంలో కళాశాలను వేరే ప్రాంతానికి తరలించాలనే ప్రతిపాదన గ్రామస్తులు వ్యతిరేకించారు. కళాశాల గ్రామానికి దూరంగా ఉండడంతో ముఖ్యంగా బాలికలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడేవారు కాదు.

ఎమ్మెల్సీ తోట కృషితో..

కళాశాలను పొలాల నుంచి మార్చాలని కోరుతూ గతంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు పలుమార్లు స్థానిక నేతలు వినతి పత్రాలు సమర్పించారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కూడా కళాశాలను తరలించాలని పలుమార్లు నిరసనలు వ్యక్తం చేశారు. అయినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదనే విమర్శలున్నాయి. కాగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలోకి కళాశాలను తరలించాలనే ప్రతిపాదనను ఏఎంసీ డైరెక్టర్ తేతల సుబ్బరామారెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ



ప్రస్తుతం కళాశాలను తరలించనున్న జెడ్పీ ఉన్నత పాఠశాల

నేతలు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ తోట కళాశాలను ఉన్నత పాఠశాలలోకి తరలించి మరింత మంది విద్యార్థులు చదువుకునేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. వెంటనే ఆయన ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులతో మాట్లాడి కళాశాల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థానిక ఉన్నత పాఠశాలలోకి తరలించి, తరగతులు నిర్వహించేందుకు ఆదేశాలిచ్చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యలకే తొలి ప్రాధాన్యం



ప్రజా సమస్యల పరిష్కారానికే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తుంది. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశం కావడంతో వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాను. త్వరలోనే కళాశాలను ఉన్నత పాఠశాలలో ప్రారంభిస్తాం.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ

నాటి పాలకులు పట్టించుకోలేదు



గతంలో టీడీపీ నేతలు స్వార్థ రాజకీయాలతో కళాశాలను ఇక్కడ నుంచి తరలించారు. కళాశాలను ఉన్నత పాఠశాల నుంచి తరలించడాన్ని ముందే అడ్డుకున్నాం. పొలాల్లో దూరంగా ఉండడంతో విద్యార్థుల చేరికలు తగ్గాయి. పరిస్థితిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు వివరించడంతో వెంటనే స్పందించి, పరిష్కారం చూపారు.

– తేతల సుబ్బరామారెడ్డి, చైర్మన్, రాయవరం

విద్యార్థుల చేరికలు పెంచుతాం



కళాశాల ఊరికి దూరంగా ఉండడంతో విద్యార్థుల చేరికలు తగ్గిపోయాయి. ఇకపై విద్యార్థుల చేరికలు బాగా పెరిగే అవకాశముంది. సబ్జెక్టు అధ్యాపకులు తగినంతగా ఉన్నారు. కళాశాలకు పూర్వ వైభవం తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తా.

– నాగేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాయవరం

క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరం



విద్యార్థికి మెమెంటో, ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని ఆర్టీసీ యూనియన్ నాయకులు డీవీఎస్ రాజు, కాకినాడ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ బాలకృష్ణ అన్నారు. ద్రాక్షారామ ఉన్నత పాఠశాలలో ఆదివారం సత్యమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువత ఆరోగ్యం దేశ సౌభాగ్యం అనే అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం పీఎస్‌బీఎస్‌కే సుందరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఫౌండేషన్ కన్వీనర్ తాడాల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మంచి ఆహారపు అలవాట్లు, నియమాల గురించి తెలియజేయాలన్నారు. ఫౌండేషన్ కార్యదర్శి, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ తొగరు మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రమశిక్షణతో ముందుకు సాగుతూ నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆర్టీసీ యూనియన్ నాయకుడు రాజు సహకారంతో ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో సైన్సు కోర్డినేటర్ గిరజాల సుబ్రహ్మణ్యం, ఫౌండేషన్ సభ్యులు బంధకవి రామారావు దంగేటి చంద్రశేఖర్, చుండ్రు వెంకటరావు, సురేష్ జైన్, ఆచంట రాంబాబు పాల్గొన్నారు.

ఏడిద గ్రామాభివృద్ధికి కృషి



సర్పంచ్ ఆశీర్వాదాన్ని సత్కరిస్తున్న సుధాకర్ తదితరులు

మండపేట: అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, అవార్డు స్ఫూర్తితో ఏడిద గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా ఉత్తమ సర్పంచ్‌గా కలెక్టర్ హిమాన్షుశుక్లా నుంచి అవార్డు అందుకున్న ఆశీర్వాదాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకుడు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో దళిత నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకుల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు తాతపూడి ఉషా, దళిత నాయకులు ఖండవిల్లి మోషే, సిద్ధాంతపు అహరోను, పలివెల సుబ్బారావు, ఖండవిల్లి దేవదాసు, పైడిమళ్ల రాజు, పువ్వల సుధాకర్ పాల్గొన్నారు.

నూతన రథానికి హైడ్రాలిక్ సిస్టం రాక

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి కల్యాణానికి సిద్ధం చేస్తున్న నూతన రథానికి సంబంధించి రూ.10 లక్షల విలువైన హైడ్రాలిక్ సిస్టం ఆదివారం ఆలయానికి చేరుకుంది. ఈ అత్యాధునికమైన హైడ్రాలిక్ సిస్టమ్‌ను రథానికి బిగించి సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు, రథ నిర్మాణ స్థపతి సింహాద్రి గణపతి ఆచార్యులు పర్యవేక్షించారు.

పంట పొలాలపై స్వైర'వరాహాలు'



తర్లంపూడిలో పంట పంటపొలాల్లో చొరబడి నాశనం చేస్తున్న పందులు

కాజులూరు: మండలంలోని తర్లంపూడిలో పందుల స్వైరవిహారం రోజురోజుకి అధికమౌతుంది. నిన్న మొన్నటి వరకూ గ్రామ వీధుల్లో, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్యకేంద్రం ఆవరణల్లో యథేచ్ఛగా సంచరిస్తూ పరిసరాలను అస్తవ్యస్తం చేస్తూ వస్తున్న పందులు తాజాగా పంట పొలాలపై దాడి చేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దాళ్వాలో సాగునీటి ఎద్దడి కారణంగా పొలాల్లో నీరు తక్కువగా ఉంటుంది. దీంతో పందులు పొలాల్లో సంచరిస్తున్నాయి. పొలం మధ్యలోకి వెళ్లి చిగుర్లు వేస్తున్న వరి మొక్కలను కొరికితింటున్నాయి. పందులు పొలాన్ని సైతం తొక్కి చిందరవందర చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. తర్లంపూడి, జగన్నాథగిరి గ్రామాల సరిహద్దులో రహదారికి ఇరువైపులా జగన్నాథగిరికి చెందిన కొందరు పాకలు వేసి పందులు పెంచుతున్నారని రాత్రి సమయాల్లో పందులను తమ గ్రామంలోని పొలాల్లోకి వదులుతున్నారని రైతులు చెబుతున్నారు. పందులను తమ గ్రామంలోకి వదల వద్దని గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదులు చేసినా, జగన్నాథగిరి పెద్దల సమక్షంలో తగవుపెట్టినా ఫలితం లేకపోయిందన్నారు. పందులను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

గడప గడపకూ సంక్షేమమే సీఎం ధ్యేయం



వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

మంత్రి చెల్లుబోయిన వేణు

రామచంద్రపురం: అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ కార్యక్రమాల లబ్ధి మొత్తాలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లోనే జమచేస్తూ గత ప్రభుత్వాలకు భిన్నంగా అవినీతికి తావులేకుండా పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. రామచంద్రపురం పట్టణంలోని 23వ వార్డులో ఆదివారం గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి వివరించి పత్రాలను పంపిణీ చేశారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరించి వారి సమస్యలు తెలుసుకుని నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అందరూ బాగస్వామ్యులై పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ అందించాలనే ఉద్దేశంతో నవరత్నాలను ప్రవేశపెట్టిందని దానిలో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా మధ్యవర్తిత్వం లేకుండా అందిస్తుందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఏ పథకం అందాలన్నా, సమస్య పరిష్కారం కావాలన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు, జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వచేందన్నారు. కానీ సీఎం జగన్ ప్రభుత్వంలో ఎవరి వద్దకు వెళ్లకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయని అన్నారు.

జనసేన కౌన్సిలర్ మద్దతు..

వార్డులో జరుగుతున్న గడపగడపకూ కార్యక్రమానికి కౌన్సిలర్ అంకం శ్రీనివాస్ మద్దతు ప్రకటించారు. వార్డులో కార్యక్రమం ప్రారంభం అయిన ప్పటి నుంచి ముగిసే వరకు లబ్ధిదారులకు జగనన్న నవరత్న పథకాలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ ఇన్‌చార్జ్ శ్రీధర్, వార్డు ఇన్‌చార్జి కొప్పిశెట్టి శ్రీనివాస్, కౌన్సిలర్ కేతా శ్రీను, పార్టీ నేతలు బి.భద్రరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గనిపోతురాజుస్వామిని దర్శించిన చైర్‌పర్సన్ దుర్గారాణి



చైర్‌పర్సన్ దుర్గారాణిని సత్కరిస్తున్న వెంకన్నబాబు తదితరులు

మండపేట: కేశవరంలో వేంచేసిన గనిపోతురాజు స్వామివారిని ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఆలయ కమిటీ చైర్మన్ కూసు నరసింహమూర్తి, మండల ఆర్‌బీకే కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు తదితరులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు, జేసీఎస్ మండల కన్వీనర్ బందెల సాయిరాం, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, సచివాలయ కన్వీనర్ అద్దంకి రమణ, ఆలయ ఈఓ అన్నందేవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానంతో పూడికతీత



కాలువలో పూడిక తీస్తున్న రైతులు

మండపేట: పంట కాలువల్లో పూడిక తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం కారణంగా శివారు భూములకు సాగు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం శ్రమదానంతో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. పట్టణంలోని రామచంద్రుడు పంటకాలువ శివారు ప్రాంతమైన గొల్లపుంత, బూరుగుపుంతలోని సుమారు 400 ఎకరాల్లో రబీ సాగు చేస్తున్నామని రైతులు తెలిపారు. సంఘం కాలనీ వద్ద నుంచి సుమారు మూడు కిలోమీటర్లు మేర కాలువ పూడికతో నిండిపోవడంతో శివారు భూములకు సాగునీరందక పంటపొలాలు ఎండిపోయి నెరలు తీస్తున్నాయన్నారు. సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికే ఎకరాకు రూ.10 వేలు నుంచి రూ.15 వేలు వరకూ పెట్టుబడులు పెట్టామని, సాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్య పరిష్కారానికి శ్రమదానంతో పూడిక తీయాలని నిర్ణయించామన్నారు. పట్టణంలో కాలువ ప్రవహిస్తున్న చోట స్థానికులు గాజు సీసాలు, జంతువుల మృత కళేబరాలను కాలువలో పడేస్తుండటంతో కాలువలోకి దిగి పూడిక తీయడం కష్టంగా ఉందన్నారు. అధికారులు స్పందించి ప్రొక్లెయిన్‌తో పూడికతీతకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై ఇరిగేషన్ జేఈ నాగరాజును వివరణ కోరగా పూడిక తీతకు టెండర్లు పిలిచామని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

పూల మొక్కకు 'చెన్నుపాటి'గా నామకరణం



పూలమొక్కకు లక్ష్మయ్య పేరును నామకరణం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మండపేట: ఎర్రని పూలతో అరుణపతాకంలా రెపరెపలాడే ఓ విదేశీ పూల మొక్కకు దేశంలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత స్వర్గీయ చెన్నుపాటి లక్ష్మయ్య పేరును యూటీఎఫ్ పెట్టింది. ఆదివారం మండపేటలో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీలు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ తదితరులు విదేశాలకు చెందిన ఫాన్సిటియా రెడ్ మొక్కకు చెన్నుపాటి లక్ష్మయ్య ఫ్లవర్స్ ప్లాంట్ అని నామకరణం చేశారు. ఈ మొక్కకు ఇంతవరకు స్థానిక పేరు లేదని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చిలుకూరి శ్రీనివాసరావు, సంఘ నాయకులు ఈవీఎస్ఆర్ ప్రసాద్, గండి స్వామి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామిని సన్నిధిలో పూరాజీ, కన్నా



ద్రాక్షారామ భీమేశ్వరస్వామిని దర్శించిన స్వామిశంకర పూరాజీ



కన్నా లక్ష్మీనారాయణకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న ఈవో సత్యనారాయణ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారిని ఆదివారం బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, కాశీ అన్నపూర్ణాలయం పీఠాధిపతి స్వామిశంకర పూరాజీలు వేర్వేరుగా దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వీరు వేదపండితుల ఆశీర్వచనలు తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఫిబ్రవరి 1న జరిగే స్వామివార్ల కల్యాణోత్సవాలకు హాజరు కావాలని ఆలయ ఈవో పీటీవీవీ సత్యనారాయణ కన్నా లక్ష్మీనారాయణకు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. వీరి వెంట కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ తదితరులు

మండపేట: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ద్వారా సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కౌన్సిల్ సమావేశాలు ఆదివారం స్థానిక సూర్య ఫంక్షన్ హాలులో జరిగాయి. సంఘ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా విధానంలో ఇటీవల జరుగుతున్న మార్పులకు సంఘం చేస్తున్న కృషిని వివరించారు. విద్యా వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఉండాలని యూటీఎఫ్ నేతలు పిలుపునిచ్చారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాడు–నేడు ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సామాజికసేవా కార్యక్రమాల్లోను ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తొలుత ఉద్యమ పతాకాన్ని ఆవిష్కరించి వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆలపించిన ఉద్యమ గీతాలు అలరించాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా పి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జ్యోతి బసు, గౌరవ అధ్యక్షుడిగా ఎంవీ సుబ్బారావు, సహాధ్యక్షుడిగా పి.సురేంద్ర కుమార్, సహ అధ్యక్షురాలిగా పీఎస్ శిరోమణి, కోశాధికారిగా కే.సురేష్ కుమార్, కార్యదర్శులుగా జీవీ రమణ, ఎం.ప్రదీప్ కుమార్ తదితరులు ఎన్నికయ్యారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు డీవీ రాఘవులు, జి.ప్రభాకర వర్మ, జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవి కుమార్, సంఘ నాయకులు పి.సురేంద్ర కుమార్, కె.గోపాల కృష్ణారెడ్డి, పి. రామచంద్రారెడ్డి, కె.సత్తిబాబు, ఎం త్రినాథరావు, తాడి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

భూమీకి పచ్చాని రంగేసినట్టు..



పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అనే నానుడికి రామచంద్రపురం నియోజకవర్గమే నిదర్శనం. అటు జీవనశైలి ఇటు పల్లె అందాల్లోను పట్టణ వాసులకు కనువిందు చేస్తుంది. మానవుని జీవనంలో దాదాపు సుదీర్ఘకాలం పాటు వెన్నంటి వచ్చేది పల్లెలే. ప్రస్తుతం పల్లె వాతావరణం పుడమితల్లికి పచ్చబొట్టు వేసినట్లు కనువిందు చేస్తుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్న తరుణంలో నల్లగా కనిపించే భూమి మొత్తం పచ్చరంగుతో నిండి ఆహ్లాదాన్ని అందిస్తుంది. ఓవైపు మంచుతో పల్లె వాతావరణం ఊటీని తలపిస్తుంది.

– కె.గంగవరం